ఆంధ్రజ్యోతి


**

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

గురువారం 18 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.158	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.5 । కనిష్ఠం 24.8

కమనీయం రమణీయం

రాములోరి కళ్యాణం

చూడముచ్చటగా సీతారాముల పరిణయం

జిల్లావ్యాప్తంగా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

వేదమంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాలు.. గుండెల నిండా రామనామస్మరణతో జిల్లా మారుమోగింది. సకల గుణాభిరాముడు, సద్గుణవతి సీతాదేవి పరిణయ వేడుక బుధవారం చూడముచ్చటగా సాగింది. ముందుగానే అందంగా అలంకరించిన రామాలయాల్లో భక్తులకు ఏర్పాట్లు చేయడంతోపాటు కల్యాణవేదికలను ముస్తాబు చేశారు. క్రోధినామ సంవత్సర చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రం, కర్కాటక రాశి, అభిజిత్ లగ్న సుముహూర్తమున స్వామివారు అమ్మవారి మెడలో మాంగళ్య దారణ చేశారు. ఎంతో ఆధ్యాత్మికతను నింపుకున్న ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సంప్రదాయరీతిలో ఎదుర్కోలు ఉత్సవాలు నిర్వహించారు. అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. రాత్రికి కల్యాణ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. వేద పండితులు శ్రీరామ నవమి విశిష్టతను వివరించారు.

- సూర్యాపేట టౌన్



మిర్యాల క్షేత్రంలో తాళిబొట్టును చూపిస్తున్న అర్చకుడు





సూర్యాపేటలో కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దంపతులు



కోదాడ మండలం తమ్మరలో కల్యాణోత్సవం

ఎన్నికల షెడ్యూల్

ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ
25న నామినేషన్లకు చివరి గడువు
26న నామినేషన్ల పరిశీలన
29న నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు
మే 13న పోలింగ్
జూన్ 4న ఓట్ల లెక్కింపు



నామినేషన్ల స్వీకరణకు సిద్ధమైన కలెక్టరేట్

సమరం షురూ

సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభంకానుంది. మైకుల మోతలు.. ప్రచార హోరుతో నామినేషన్ల పర్వం మొదలు కానుంది. ఇప్పటికే వేడెక్కిన వాతావరణం.. మరింత ఉద్విగ్నంగా మారనుంది. ప్రతిపక్షాల ఆరోపణలు.. అధికార పక్షం ఎదురు దాడులతో రసవత్తరం కానుంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో, నల్లగొండ పార్లమెంట్ స్థానానికి నల్లగొండ జిల్లాకేంద్రంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- నేడు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్
- ఈ నెల 18 నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ
- భువనగిరి కలెక్టరేట్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 11 నుంచి 3గంటల వరకు

లోక్‌సభ నియోజకవర్గస్థాయిలో గురువారం నోటిఫికేషన్ జారీ చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ మేరకు భువనగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే సంబంధిత అధికారులతో సమీక్షించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల్లో విస్తరించి ఉంది. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, జనగామ జిల్లాలోని జనగామ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ నియోజకవర్గంలో 18 లక్షల మంది ఓటర్లున్నారు. భువనగిరి నియోజకవర్గం విస్తీర్ణంపరంగా పెద్దది కావడంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా నియోజకవర్గాల్లోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్వోలు), వివిధ శాఖల అధికారులతో ఎన్నికలపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లాస్థాయిలో నోడల్ అధికారులను నియమించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన వారు ప్రస్తుతం ఏఆర్వోలుగా ఉంటారు. వీరికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ పూర్తిచేశారు. నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల కోడ్ అమలు,సీ-విజిల్,తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

పర్యవేక్షణ కట్టుదిట్టం

ఎన్నికలను సజావుగా పారదర్శకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కట్టుదిట్టంగా చేయించేందుకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్, మోడల్ కోడ్ అఫ్ కండక్ట్, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీంలను ఏర్పాటుచేశారు. ఈ నియోజకవర్గంలో 2,141 పోలింగ్ కేంద్రా లు ఉన్నాయి. పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ అధికారు లు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులను గుర్తించారు. ఈ ఎన్నికల నిర్వహణకు మొత్తం పోలీసు సిబ్బందితో కలిపి 20వేలకు పైగా మంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్‌కు వినియోగించేందుకు ఈవీఎం ల పరిశీలన మొదటి దశ పూర్తయింది. అన్నిరాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. మరోసారి కూడా పరిశీలించనున్నారు.

భువనగిరి కలెక్టరేట్ వద్ద నామినేషన్ల స్వీకరణ

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే వ్యవహరిస్తున్నారు. అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ భువనగిరి మండలం రాయిగిరిలో గల కలెక్టరేట్‌లో ఉంటుంది. ఈ మేరకు కలెక్టరేట్ ఆవరణలో భద్రత కట్టుదిట్టం చేశారు. కలెక్టర్ కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు మాత్రమే ర్యాలీకి అనుమతి ఉంటుంది. అభ్యర్థుల వెంట నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ నెల 25న నామినేషన్లకు చివరి గడువు. అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే నామినేషన్లు వేసే కార్యక్రమానికి అనుమతి ఉంటుంది. అదే విధంగా ఒక్కో అభ్యర్థికి మూడు వాహనాలకు మాత్రమే నామినేషన్లు వేసే ప్రాంతానికి అనుమతిస్తారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు సంబంధించి జనరల్ అభ్యర్థులు నామినేషన్ సందర్భంగా రూ.25వేలు డిపాజిట్ చేయాల్సి ఉండగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్‌తోపాటు ఫాం-26 ద్వారా అఫిడవిట్ దాఖలు చేయాలి. నామినేషన్లు వేసే ప్రాంతంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పారదర్శకంగా ఎన్నికలు

భువనగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

యాదాద్రి: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నేడు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు భువనగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, ఉదయం 11గంటల నుంచి 3గంటల సమయం వరకు ఉంటుందని తెలిపారు. సెలవుదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదని తెలిపారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల్లో ఎస్‌ఎస్‌టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్‌ఎస్‌టీ టీములు 58 పనిచేస్తున్నాయని, 245 సెక్టార్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్ పాల్గొన్నారు.

భువనగిరిలో మొత్తం 18,04,930 ఓటర్లు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో 18,04,930 ఓటర్లు ఉన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం ఉండటంతో మరింత మంది ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని ఓటర్ల తుది జాబితాను జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రకటించింది. భువనగిరి నియోజకవర్గంలో మొత్తం 18లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 8,96,219, మహిళలు 9,08,632, ఇతరులు 79 మంది ఓటర్లు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి

భువనగిరి అర్బన్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఈసీ సమీక్షించి మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బూత్‌లెవల్‌లో ఓటింగ్‌శాతం పెంచేలా సెక్టార్ అధికారులతో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లు కూడా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవడమేకాక అర్బన్ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణపై హెల్ప్‌డెస్క్ ద్వారా వివరించాలన్నారు. ఈవీఎం రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

నిప్పుల కొలిమి

నిడమనూరులో 44.8డిగ్రీలు ● సూర్యాపేట 44.7డిగ్రీలు



తాటిముంజలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సూర్యాపేటటౌన్ / నల్లగొండ, ఏప్రిల్ 17 : భానుడి ఉగ్రరూపంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రజలు విలవిల్లాడారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 44.8, సూర్యాపేట జిల్లాలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడిమి అధికంగా ఉండడంతో ప్రజలు ఇంటి నుంచి అడుగు బయటపెట్టలేదు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటికి వెళ్లేందుకు వెనుకడుగు దీంతో దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడి భగభగలు మొదలయ్యాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో రోజు కూలి పనులకు వెళ్లే వారు ఒక రోజు కూలీకి వెళ్తే రెండు రోజులు ఇంటి వద్దే ఉంటున్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. రోడ్లపై తోపుడు బండ్లు, కూరగాయలు, పండ్లవిక్రేతలు గొడుగు నీడలో వ్యాపారం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరులో గరిష్ఠంగా 44.8 డిగ్రీలు, చింతపల్లి మండలం గొడకండ్ల గ్రామంలో కనిష్ఠంగా 39.1డిగ్రీలు, సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో గరిష్ఠంగా 44.7డిగ్రీలు, తుంగతుర్తి మండలంలో కనిష్ఠంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా గరిష్ఠంగా గుండాల మండలంలో 43.5 డిగ్రీలు, తుర్కపల్లి మండలం మన్నెవారి తుర్కపల్లి గ్రామంలో 39.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ జిల్లాలోని 10 ప్రాంతాల్లో 44డిగ్రీలకు పైగా, సూర్యాపేట జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో 44డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ ఉష్ణోగ్రతలకు చిన్న పిల్లలు, వృద్ధులు తల్లడిల్లిపోతున్నారు.

పండ్ల రసాలకు పెరిగిన డిమాండ్

జిల్లాలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు పండ్ల రసాల సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. మధ్యాహ్నం పనినిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు గొంతు తడారకుండా పండ్ల రసాలను తీసుకుంటున్నారు. దీంతో ఆయా వ్యాపారాలకు డిమాండ్ పెరిగింది. నిమ్మకాయల సోడా, పండ్లు, చెరుకు రసాలు సేవిస్తూ ఉపశమనం పొందుతున్నారు.

బయటకు రావాలంటే భయమేస్తోంది: సరోజన, గృహిణి

ఎండ తీవ్రతతో బయటకు రాలేకపోతున్నాం. ఇంట్లో వేడి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. నిత్యం ఫ్యాన్లు, కూలర్లను వాడాల్సి వస్తోంది. గతంలో కన్నా ప్రస్తుతం కరెంట్ బిల్లు అధికంగా వచ్చేలా ఉంది. ఏచిన్న పని ఉన్నా ఉదయం చూసుకుంటున్నాం.

అవసరమైతేనే బయటకు రావాలి: కోటా చలం, డీఎంహెచ్‌వో



అవసరమైతేనే ప్రజలు బయటకు రావాలి. వడదెబ్బ తగిలితే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స తీసుకోవాలి. ఎండ నుంచి ఉపశమనం కోసం జాగ్రత్తలు తీసుకోవాలి. బయటకు వెళ్లినప్పుడు తలపై వస్త్రాలు ధరించాలి. నిత్యం మంచినీటిని సేవించాలి. ఏచిన్న సమస్య ఉన్నా వైద్యుల సలహాలు పాటించాలి. వడదెబ్బ తగిలితే 108కి సమాచారం ఇవ్వాలి.

మౌలికసదుపాయాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 17 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా ఏర్పాటు చేయాలన్నారు. వీల్‌చైర్లతో పాటు సహాయ సిబ్బందిని నియమించాలన్నారు. జిల్లా అంతటా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని, అక్రమ రవాణాను అరికడుతున్నామన్నారు. 80 సంవత్సరాలు నిండిన వారికి హోంబ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు ఫాం-12(డీ) ఫారాలను సకాలంలో అధికారులకు అందజేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌ఐ శ్రీధర్ ఉన్నారు.

రైస్‌మిల్లుల్లో ముమ్మర తనిఖీలు

జిల్లాలో సీఎంఆర్ లక్ష్యాలను నెరవేర్చని రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటరావు తెలిపారు. తనిఖీల వివరాలను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. తిరుమలగిరి, కోదాడలోని జగన్‌మాత, సంతోష్, వేంకటేశ్వరమిల్లులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామన్నారు. నిబంధనల ప్రకారం మిల్లు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎస్.. నేనే బాస్!

- తల్చుకున్నానంటే 120మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది అవుట్
- రెండు నెలల్లో ఇంటిబాట పట్టిస్తానంటూ డీసీసీబీలో ఓ అధికారి అల్టిమేటం
- వణికిపోతున్న చిరుద్యోగులు



రెండు నెలల్లో ఇంటికి వెళ్లిపోతారు

నల్లగొండ, ఏప్రిల్ 17 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో చిరుద్యోగులు అభద్రతతో వణికిపోతున్నారు. ఉద్యోగం పర్మినెంట్ అవుతుందన్న ఆశతో ఉన్న వారిని ఉన్న ఉద్యోగం ఊడిపోతుందన్న భయం వెంటాడుతోంది. డీసీసీబీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆయా బ్రాంచ్‌లు, పీఏసీఎస్‌లు, జిల్లా కార్యాలయంలో 120మంది వరకు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. కొందరు 20 నుంచి 25 ఏళ్లుగా, మరికొందరు 10 నుంచి 12 ఏళ్లుగా, ఇంకొందరు 5 నుంచి 7 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అయితే కొద్దిరోజులుగా వారికి ఉద్యోగ భద్రతపై నమ్మకం పోతోంది. పర్మినెంట్ కోసం గతంలో కొందరు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు పాలకవర్గాలపై నమ్మకం పెట్టుకుని పనిచేసుకుంటూపోతున్నారు. అయితే పర్మినెంట్ ఏమోకాని ఉన్న ఉద్యోగం కూడా పోతుందన్న భయం వారిని నీడలా వెంటాడుతోంది.

డీసీసీబీలోని ఓ ఉన్నతాధికారి తీసుకుంటున్న నిర్ణయాలు చిరుద్యోగులను హడలెత్తిస్తోంది. రెండు నెలల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ఇంటిబాట పట్టిస్తానని అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గం అంతా అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మద్దతు ఉండగా సదరు అధికారి మాత్రం ఆ సిబ్బందిని తొలగించి తీరుతానని భీష్మించినట్లు చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన ఎంసీ మీటింగ్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించకూడదని పాలకవర్గం నిర్ణయించినట్లు సమాచారం. అయితే అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఖజానాకు నష్టం వాటిల్లుతోందని వారితో ఉపయోగం లేదన్న విధంగా ఆ అధికారి వితండా వాదన చేయడం పాలకవర్గాన్ని సైతం ఆశ్చర్యాన్ని కలిగించినట్లు తెలిసింది. రైతుల కోసం ఏర్పడిన డీసీసీబీ ప్రస్తుతం పాలకవర్గం ఏర్పడక ముందు అప్పటికే 103 ఏళ్ల చరిత్ర ఉండగా కేవలం రూ.900కోట్ల టర్నోవర్ మాత్రమే ఉంది. గత నాలుగేళ్లలో ఈ పాలకవర్గం కాలంలోనే రూ.1400కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. అంటే మొత్తం 107 ఏళ్ల బ్యాంకు చరిత్రలో రూ.2300కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. దీంతో పాటు బ్యాంకు లాభాల బాటలో పయనిస్తున్న సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తానని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న తలెత్తుతోంది. అదేవిధంగా రూ.30.16కోట్ల గ్రాస్ ప్రాఫిట్ ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.22.42కోట్ల నెట్ ప్రాఫిట్‌కు చేరింది. ఇంతా పెద్దఎత్తున లాభాలు ఉన్నా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏ ప్రతిపాదికన తొలగించాలని ఆలోచిస్తున్నారో అర్థకావడంలేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఆ సార్‌ను కలవాలంటే పీఏ ద్వారా వెళ్లాల్సిందే

గతంలో లేని కొత్తవిధానం డీసీసీబీలో నడుస్తోందని అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా కార్యాలయంతో పాటు పీఏసీఎస్ సీఈవోలు, బ్రాంచీల మేనేజర్లు, ఉన్నతాధికారులు సైతం ఆ సార్‌ను కలవాలన్నా, ఫైల్‌ల పరిశీలన జరగాలన్నా పీఏ ద్వారానే అన్న పరిస్థితి ఏర్పడింది. డీసీసీబీలో గతంలో పనిచేసిన ఏ ఉన్నతాధికారి వారి ఛాంబర్ల వద్ద అటెండర్‌కు మించి ఉద్యోగి ఉండరు. అయితే ప్రస్తుతం ప్రత్యేకంగా ఓ పీఏనే నియమించుకున్నారు. బ్యాంకు అధికారులతో పాలకవర్గ నిర్ణయాలను చర్చించి ఫైల్స్‌ను క్లియర్ చేయాల్సింది పోయి అధికారులను, ఉద్యోగులను ఛాంబర్‌లోకి రానివ్వడమే మాన్పించినట్లు తెలుస్తోంది. పూర్తిగా ఆ పీఏతోనే ఫైల్ డిస్కస్ చేసి మిగతా సమాచారాన్ని పీఏ ద్వారానే చేరవేయడం తప్ప వారిని కనుచూపు మేరలోకి రానివ్వడం లేదని సమాచారం. రాజకీయ నాయకులతో మమేకమై ఉన్న డీసీసీబీలో అధికారులు, ఉద్యోగులు, సదరు ఉన్నతాధికారి మధ్య కోల్డ్‌వార్ మొదలైంది. ఆ అధికారి ఏకపక్ష నిర్ణయాలతో పాలకవర్గం ఎలాంటి ఆలోచన చేస్తుందో వేచి చూడాల్సిందే.

సిబ్బంది తొలగింపుపై నిర్ణయం జరగలేదు: శంకర్‌రావు, సీఈవో, డీసీసీబీ

అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు విషయం కొన్ని రోజుల క్రితం పాలకవర్గ మీటింగ్‌లో ఇంటర్నల్‌గా చర్చించిన విషయం వాస్తవమే. అయితే వారిని తొలగించ కూడదని, ప్రస్తుతానికి నిర్ణయించాం. వారిని కొనసాగించాలనే ఆలోచనకు వచ్చాం.

22క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చెర్కుపల్లి స్టేజీవద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

డిండి, ఏప్రిల్ 17: వాహనంలో తరలిస్తున్న 22క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా డిండి మండలంలోని చెర్కుపల్లి స్టేజీవద్ద అధికారులు బుధవారం పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ చెర్కుపల్లి స్టేజీవద్ద స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న చందంపేట మండలం నల్లచలమూల గ్రామానికి చెందిన ముత్యాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. చందంపేట మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని వాహనంలో డిండి మండలంలోని రైస్‌మిల్లుకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శేశిలేటివాగులో మంటలు



శేశిలేటివాగులో ఎగిసిపడుతున్న మంటలు

గుర్రంపోడు, ఏప్రిల్ 17: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని శేశిలేటివాగులో బుధవారం సాయంత్రం మంటలు దట్టంగా వ్యాపించాయి. గుర్తుతెలియని వ్యక్తులు మంట పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. శేశిలేటివాగులో జమ్ము ఉండడంతో పశువులు, మేకలు మేసేందుకు వీలు లేకుండా ఉంది. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు జమ్మును తొలగించేందుకు నిప్పు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. వాగులో మంటలు వ్యాపించడంతో రైతులకు సంబంధించిన పైపులు, మోటార్లు, విద్యుత్ వైర్లు దగ్ధమైనట్లు తెలిసింది. మంటలు వ్యాపించడంతో ప్రజలు ఎవరూ అక్కడికి వెళ్లడం లేదు. స్థానికులు అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పుతున్నారు.

గుట్టలో వైభవంగా సీతారాముల కల్యాణం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 17: యాదగిరిక్షేత్రంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి అనుబంధ శివాలయంలో ఈ నెల 9 నుంచి చేపట్టిన వసంతోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా నిత్యారాధనల అనంతరం అభిషేకం, ఆధ్యాత్మిక రామాయణ పారాయణం, స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర శత నామార్చనలు చేశారు. వేదపండితులు, పురోహితులు వేదమంత్రోచ్చరణల నడుమ మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా స్వామిఅమ్మవార్లను వజ్ర వైఢూర్యాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠించి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాత్రి వేళ హనుమాన్‌మూర్తులకు సహస్ర నామార్చనలు, నివేదన నీరాజనం, మంత్ర పుష్పాలు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు తీర్థప్రసాద వితరణ చేయగా కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు రామారావు, పూజారి దోర్బల శ్రీధరశర్మ, ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యకైంకర్యాలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా జరిగాయి. అదేవిధంగా కొండపై శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,15,058 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి
కేసీఆర్ అభినందన



మహేందర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

యాదగిరిగుట్ట రూరల్, నల్లగొండ, ఏప్రిల్ 17: అప్పుల్లో ఉన్న ఉమ్మడి నల్లగొండ డీసీసీ బ్యాంకును లాభాల్లోకి తెచ్చిన డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని మాజీ సీఎం కేసీఆర్ అభినందించారు. ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను బుధవారం కలిశారు. దేశంలోని 540 డీసీసీబీల్లో ఉత్తమ అవార్డుకు ఎంపికైన ఐదుగురిలో మహేందర్‌రెడ్డి ఒకరు కావడం రాష్ట్రానికే గర్వ కారణమని కేసీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన సింగిల్ విండో చైర్మన్లు మొరిగాడి మల్లేశంగౌడ్, ఎన్. పరమేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, గూదె బాలనర్సయ్య, ఎస్. నర్సింహారెడ్డి, చింతలపురి భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, గుండాల వైస్ చైర్మన్ పురుగుల మల్లేశయాదవ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

తిప్పర్తి, ఏప్రిల్ 17: అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సర్వారం గ్రామానికి చెందిన గంట నాగరాజు గ్రామంలోని తన కిరాణ దుకాణంతో పాటు బెల్ట్ షాపు ని ర్వహిస్తున్నాడు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో విక్రయించడానికి అనుమతి లేనందున దుకాణంలో ఉన్న 43మద్యం క్వాటర్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. సీజ్ చేసిన మద్యం విలువ సుమారు రూ.8వేల వరకు ఉంటుందని తెలిపారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నాం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం


● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోంది

● మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు



మాట్లాడుతున్న నర్సింహులు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 17: మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మా జాతి హక్కులు మాకు కల్పించడం లేదు' అని మంద కృష్ణ మాదిగ మాట్లాడిన దాంట్లో తప్పు లేదన్నారు. కడియం శ్రీహరిది ఏ కులమో ఆయనకే తెలియదన్నారు. మాదిగలకు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశామన్నారు. తెలంగాణలో దాదాపు 80లక్షల మంది మాదిగల జనాభా ఉన్నప్పటికీ ఆ జనాభాకంటే తక్కువ శాతం ఉన్న ఇతర కేటగిరీ కులస్థులకు ఒక్క ఇంటిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఆ కుటుంబంలోనే మరో వ్యక్తికి ఎంపీ టికెట్ కేటాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ లమనే తమ కులస్థులకు ఇప్పటివరకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికీ కాంగ్రెస్ పార్టీ నుంచి మారే ఉద్దేశం లేదని, మాదిగలకు జరుగుతున్న అన్యాయం, హక్కుల సాధనకు గురువారం బేగంపేటలోని లీలానగర్‌లో తన ఇంటి వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు మేధావి వర్గం ప్రజాస్వామ్య వాదులు, ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలపాలని కోరారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య



కనగల్, ఏప్రిల్ 17: అనారోగ్యంతో బాధపడుతున్న యువతి మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం పర్వతగిరి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెనగాని క్రిష్ణయ్య, లక్ష్మమ్మ దంపతుల చిన్న కూతురు కావ్య(20) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఇది గమనించిన కుటుంబసభ్యులు కావ్యను కిందికి దించి చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెం దింది. కావ్య తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కావ్య హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతూ వారం రోజుల క్రితం గ్రామానికి వచ్చిందని స్థానికులు తెలిపారు.

కారు ఇంజన్‌లో మంటలు



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 17: అధిక ఉష్ణోగ్రతల కారణంగా వాహనం ఇంజన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణ సంస్థకు చెందిన టీఎస్ 05యూఈ 4865 నెంబర్ గల వాహనం అశోక్‌నగర్‌లో రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ఆకస్మత్తుగా ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. గమనించిన కారు డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపి వేశాడు. అప్పటికే ఇంజన్‌లో మంటలు వ్యాప్తించి కాలిపోతుండగా స్థానికుల సాయంతో సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపుచేశారు. బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. అధిక ఉష్ణోగ్రతతో ఇంజన్ వేడెక్కడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ...



యాదయ్య(ఫైల్)

చిట్యాల రూరల్, ఏప్రిల్ 17: అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తూ ఒకరు అనంతలోకాలకు వెళ్లారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో బుధవారం జరిగింది. చిట్యాల ఎస్ఐ సైదబాబు తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరేపల్లికి చెందిన రూసని యాదయ్య(58) చిట్యాల పరిధిలో శివనేనిగూడెంలో తన బంధువు మృతి చెందగా అంత్యక్రియలకు వెళ్లి తన స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. వెలిమినేడు శివారులో జాతీయ రహదారి దశమి ల్యాబ్ ఎదురుగా యాదయ్య బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో యాదయ్య తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. యాదయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండకు తరలించారు.

పాఠశాల ఆవరణలో ..

గుండాల, ఏప్రిల్, 17: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రాత్రి పూజలు చేసిన ఆనవాళ్లు కన్పించాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పాఠశాలలో వాకింగ్ వెళ్లిన గ్రామస్థులకు పాఠశాల ఎదుట ఉన్న స్టేజీపైన పూజలు చేసినట్లు ఆనవాళ్లు కన్పించడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ యాకన్న సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఆకతాయిలు చేసిన పని అని తెలిపారు.

బ్యాంకు క్యాష్ ఇన్‌చార్జిపై ఫిర్యాదు

వలిగొండ, ఏప్రిల్ 17: బ్యాంక్‌లో నగదు కొరత కారణంగా బ్యాంక్ క్యాష్ ఇన్‌చార్జిపై బ్రాంచి మేనేజర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) వలిగొండ బ్రాంచిలో క్యాష్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న కాలేరు అనిల్‌కుమార్ ఏప్రిల్ 16వ తేదీ నుంచి విధులకు గైర్హాజరవుతున్నాడు. బుధవారం వరకు బ్యాంక్‌కు హాజరుకాకపోవడంతో బ్రాంచి మేనేజర్ సిబ్బందితో కలిసి అతని క్యాష్ క్యాబిన్‌ను తనిఖీ చేయగా రూ.15,50,000 నగదు కొరత కనిపించింది. పరారీలో ఉన్న ఉద్యోగి అనిల్‌కుమార్‌పై బ్రాంచి మేనేజర్ మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాజాపేట, ఏప్రిల్ 17: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కాకర్ల చంద్రకళ (55) బుధవారం ఇంట్లో నీళ్ల కోసం విద్యుత్ మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతిచెందింది. మోటార్ వైరు తేలి ఉండడంతో విద్యుదాఘానికి గురైంది. చంద్రకళకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రూ.75,800 నగదు పట్టివేత

తిరుమలగిరి, ఏప్రిల్ 17: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రైతండాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద రూ. 75,800ల నగదును పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.


సూర్యాపేటలో కల్యాణంలో పాల్గొన్న మీలా మహదేవ్

శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం జగమంతా వేడుకగా..ఊరంతా సందడిగా సాగింది. జిల్లా వ్యాప్తంగా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆ యా పట్టణాలు, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెళ్లి పెద్దలుగా కల్యాణంలో పాల్గొనగా, అర్చకులు పెళ్లితంతును సాగించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనగా అందరికీ అన్నప్రసాదం, పానకం అందజేశారు.


నేరేడుచర్లలో తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


కోదాడలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు


నడిగూడెంలో సీతారాములు


సూర్యాపేటలో కల్యాణోత్సవానికి హాజరైన కలెక్టర్ వెంకట్రావ్


మేళ్లచెర్వులో కొలువుదీరిన సీతారామలక్ష్మణులు


కోదాడ మండలం తమ్మర గ్రామంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


సూర్యాపేటలో కల్యాణోత్సవంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే జగదీ్‌షరెడ్డి, తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు


తిరుమలగిరిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేలు


ఆత్మకూరు(ఎస్) మండలం ఏపూరు గ్రామంలో సీతారాములను పల్లకిలో కల్యాణ మండపానికి తీసుకువెళుతున్న భక్తులు


మద్దిరాలలో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్


గరిడేపల్లిలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు


తుంగతుర్తిలో కల్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సీతారాముల కల్యాణ వైభోగమే..

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: జిల్లాలో గురువారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ వేదాంత భజన మందిరంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ్‌షరెడ్డి దంపతులు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొన్నారు. అంబేడ్కర్‌నగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజలకు కలెక్టర్ వెంకట్రావ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 36వ వార్డులో నిర్వహించిన అన్నదానంలో మాద నవీన్, గండూరి ప్రకాష్ పాల్గొన్నారు. విద్యానగర్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో సుధా బ్యాంక్, సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ పాల్గొన్నారు. సూర్యాపేటలోని పలు వార్డుల్లోని ఆలయాల్లో సీతారామచంద్రమూర్తులకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు పట్టువస్త్రాలు అందజేసి, పూజల్లో పాల్గొన్నారు.

● కోదాడలోని రంగా థియేటర్ చౌరస్తాలో స్వర్ణభారతి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు 200లీటర్ల చెరుకు రసాన్ని ట్రస్టు గౌరవ సలహాదారుడు పైడిమర్రి సత్తిబాబు, అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో దాత వెంకటేశ్వర్లు, ఇరుకుళ్ల చెన్నకేశవరావు పాల్గొన్నారు. 12వ వార్డు శ్రీనివాసనగర్‌లో కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుండుపనేని నాగేశ్వరరావు, వంగవీటి రామారావు, కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

●రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన కోదాడ మండలం తమ్మరలో సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని రామలక్ష్మీపురంలో నిర్వహించిన కల్యాణంలో దేవాలయం చైర్మన్ అన్నెం చిన్న వెంకటరెడ్డి, కొప్పుల శంభిరెడ్డి దంపతులు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

●కోదాడలోని భవానినగర్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీలరమేష్ హాజరయ్యారు. వరసిద్ధి వినాయక దేవాలయంలో కల్యాణాన్ని చైర్మన్ తుమ్మలపల్లి అజంతా భాస్కర్, ప్రారంభించారు. కోదాడలోని రామాలయం నుంచి సీతారాముల శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు.

● మఠంపల్లి మండలంలోని రామాలయాల్లో, మట్టపల్లి నృసింహుని క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భీల్యానాయక్‌తండాలో సీతారాముల కల్యాణాన్ని జడ్పీటీసీ జగన్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కిషోర్‌రెడ్డి, కర్నె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. రఘునాథపాలెంలో కల్యాణంలో ముస్లింలు పాల్గొని మతసామరస్యాన్ని చాటారు.

● తుంగతుర్తిలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సామేలు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, వై.నరేష్, సుంకరి జనార్దన్, సామ అంజనేయులు, పయ్యావుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో నారపరాజు శ్రీనివాసరావు, అనురాధ, ఈవో కొండారెడ్డి, రంగభట్రాచార్యులు, రాఘవాచార్యులు, నాగేశ్వరరావు, అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, యరగాని నాగన్నగౌడ్, హరి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని రామాలయానికి హుజూర్‌నగర్‌కు చెందిన న్యాయవాది నారపరాజు శ్రీనివాసరావు, మహబూబ్‌నగర్ జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి నారపరాజు అనురాధ దంపతులు రూ.లక్ష విలువైన యజ్ఞోపవీతాన్ని అందజేశారు.

● గరిడేపల్లిలో ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్ దంపతులు పీటల మీద కూర్చుని స్వామి వారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, పయిడిమర్రి రంగనాథ్ పాల్గొన్నారు.

● నూతన్‌కల్ మండలం మిర్యాలలో జరిగిన కళ్యాణానికి ఎమ్మెల్యే మందుల సామేలు, పీఏసీఎస్ చైర్మన్ ణుజయసుధసుధాకర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు.

● నేరేడుచర్ల, పెన్‌పహాడ్, తిరుమలగిరి, ఆత్మకూర్(ఎస్), మఠంపల్లి, మేళ్లచెర్వు, చిలుకూరు, నడిగూడెం, మోతె, మునగాల, అర్వపల్లి తదితర మండలాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, పానకం అందజేశారు.


నడిగూడెంలో కల్యాణం నిర్వహిస్తున్న ధర్మకర్త సత్యనారాయణ దంపతులు


హుజూర్‌నగర్‌లో దేవతా విగ్రహాలను తీసుకువస్తున్న భక్తులు


మునగాల కల్యాణ పీటలపై కూర్చొన్న ఎస్‌ఐ అంజిరెడ్డి దంపతులు


మోతెలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


సూర్యాపేటలో కల్యాణోత్సవంలో పాల్గొన్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 17: మట్టపల్లి పుణ్యక్షేత్రంలో బుధవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణ మాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి,సీతారామశాస్త్రి, శేషగిరిరావు, రాజేష్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుండెపోటుతో మైకు సెట్టు సోమయ్య మృతి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 17: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం నాయకుడు, మైకు సెట్టు సోమయ్య(72) బుధవారం తెల్లవారుజామున ఇంట్లోను గుండెపోటుతో మృతి చెందారు. హుజూర్‌నగర్ పట్టణంలో 50ఏళ్లుగా రాజకీయ పార్టీల బహిరంగ సభలకు, సమావేశాలకు, పెళ్లిళ్లకు, పేరంటాళ్లకు మైకుసెట్లను ఏర్పాటు చేస్తూ మైకుసెట్టు సోమయ్యగా, నాటితరం నటుల పాటలకు అద్భుతంగా నాట్యం చేస్తూ కళాకారుడిగా కూడా గుర్తింపు పొందారు. సోమయ్య భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సోమయ్య మృతదేహంపై కళాకారులు, టెంట్‌హౌస్ యాజయాన్యాలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.


సోమయ్య (ఫైల్ ఫొటో)

'నేటి కోదాడ సభను విజయవంతం చేయాలి'

నడిగూడెం, ఏప్రిల్ 17: నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కందూరు రఘువీర్‌రెడ్డి విజయం కోసం గురువారం కోదాడలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుత్కూరి వెంకటరెడ్డి కోరారు. గురువారం నడిగూడెంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు మండలంలోని 15గ్రామాల నుంచి వివిధ వాహనాల్లో వేయి మందిని తరలించడానికి ఏర్పాట్లుచేశామన్నారు. ఈ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

మేళ్లచెర్వు, ఏప్రిల్ 17: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని 'మైహోం' ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాస్‌రావు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం స్థానిక 'మైహోం' పరిశ్రమలో కార్మికులకు, ఉద్యోగులకు హుజూర్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎత్తైన ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే మంటల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి? వంటగదిలో గ్యాస్ సిలిండర్ ప్రమాదం జరిగినపుడు ఎలా నివారించాలి? అనే అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకకేంద్రం ఇన్‌చార్జి ఎస్‌ఐ శ్రీనివాసరావు, అగ్నిమాపక సిబ్బంది, ఎ.వీరబాబు, సురేందర్‌రెడ్డి, సైదులు, వెంకటేశ్వర్లు, సంస్థ జీఎం డాక్టర్ నాగేశ్వర్‌రావు, స్టేపీ అధికారులు, సూర్యనారాయణ, వేణునాయుడు, ఫైర్ ఆఫీసర్ లక్ష్మయ్య, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.


సిలిండర్ మంటలను ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బెల్ట్ షాపులను మూసివేయించాలి: పీవోడబ్ల్యూ


మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 17: రాష్ట్రంలో బెల్ట్ షాపులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మూసివేయించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే బెల్ట్ షాపులు తొలగిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా బెల్ట్ షాపులను మూసివేయించకపోవడం దారుణమన్నారు మంచినీరు దొరకడం లేదని, ప్రతి గామంలో సారా, బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. ఈ బెల్ట్ షాపుల కారణంలో పేద కుటుంబాల్లో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నాయకులు అమలుచేయాలన్నారు. సమావేశంలో కొత్తపల్లి రేణుక, సూరం రేణుక, జయమ్మ, విజయ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అపలేరు: ఎమ్మెల్యే సామేలు

నూతన్‌కల్, ఏప్రిల్ 17: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం మండలంలోని మిర్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కనకటి వెంకన్న, కనకటి నగేష్, వేల్పుల ఉదయ్, రాచకొండ ఎల్లయ్య, ఇరుగు జయమ్మతో ఆటు పలువురు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, గునగంటి వెంకన్న, రామచందర్‌రావు, ఇరుగు కిరణ్, వేల్పుల రఘు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 17: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, తుంగతుర్తి నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి సామ అభిషేక్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు కాంగ్రెస్ నాయకులు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజలంతా కాంగ్రెస్ వెంటే ఉన్నారని, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ శేఖర్‌నాయక్, సురేష్, మధుకర్, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లోకి పలువురు నేతలు?

చివ్వెంల, ఏప్రిల్ 17: మండలంలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ జడ్పీటీసీ, ముగ్గురు ఎంపీటీసీలు, 10మంది మాజీ సర్పంచ్‌లు తమ అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ అధి ష్టానంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మండలానికి చెందిన కొందరి నేతలను సమన్వయ పరిచి పార్టీ బలోపేతం దృష్ట్యా కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరేలా పలువురు నాయకులు వారితో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా అబీద్


అబీద్‌కు నియామకపత్రం అందజేస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 17: సూర్యాపేటకు చెందిన బీజేపీ జిల్లా నాయకుడు ఎండీ అబీద్‌ను బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. బుధవారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో అబీద్‌కు నియామకపత్రాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా అబీద్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్‌పాష, మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలగాని ధనుంజయ్‌గౌడ్, చల్లమళ్ల నరసింహ, గోగుల రమేష్, ఆరూరి శివ, పలస మల్సూర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోదాడ రూరల్, అనంతగిరి, నడిగూడెం, ఏప్రిల్ 17: కోదాడ మండలంలోని దొరకుంట 33కేవీ సబ్‌స్టేషన్ నుంచి చిమిర్యాల గ్రామం మధ్య విద్యుత్ లైన్లనకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున చిమిర్యాల, దొరకుంట గ్రామాల్లో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11గంటలకు వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ రూరల్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

● అనంతగిరి మండలంలోని చన్నుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని చన్నుపల్లి ఫీడర్, పాలవరం 11కేవీ లైన్ మరమ్మతులు చేస్తున్నందున పలు గ్రామాల్లో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ కీర్తి తెలిపారు.

● విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున నడిగూడెం మండలంలోని సిరిపురం, నారాయణపురం, కేశవపురం, రత్నవరం గ్రామాల్లో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సైదా ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా సర్వోత్తమరెడ్డి పుట్టినరోజు వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, సర్వోత్తంరెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 17: ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి పుట్టినరోజు వేడుకలను బుధవారం సూర్యాపేటలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, భైరు శైలేందర్‌గౌడ్, అక్కెనపల్లి జానయ్య, కొండపల్లి దిలీప్‌రెడ్డి, కుంభం రాజేందర్, జహీర్, పడిదల రవికుమార్, ఆలేటి మాణిక్యం, అనెపర్తి రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.